# కవితా కౌముది

## ఆవలి తీరం

లాస్యప్రియ కుప్పా

మనసుకావల మాటువేసి
మనిషి మీద అంతులేని ప్రేమ ప్రదర్శనలని
నమ్మగలమా
మది ఘోషణం దులపాలేమో

శిశిరం శిలేసుకుని కూర్చుంటే
పూల తావులపై
తుమ్మెదలవ్వగలమా
వసంతం విరజిమ్మాలేమో

దిగులు సెగలు రగులుతుంటే
గొంతు దాటని భావమేదో
గంధర్వగానం చేస్తోందంటే
గళం విప్పగలమా
మలయ మారుతం ఊపిరూదాలేమో

రాత్రికొమ్మలు కదలకుండా
పక్షి రెక్కల గాలిలో ఊగిపోతుంటే
అంతర్లోకాల అలజడి
అంకుశంలా గుచ్చుతుంటే
మనసు పొట్లం విప్పాలేమో

నిజాలు ఇజాలు నైజాలు
ఒక్కో ప్రపంచమై కదులుతుంటే
నాకు నేను కొత్తగా
ఎన్నో నేనులు నాలో సంచరిస్తుంటే
మనసడివి కారుచిచ్చులో మాడిపోతుందేమో

ఏ మాట ఎప్పటిదో
ఏ మౌనం దేనికోసమో
ఏ కోపం ఎవరిని మాడ్చేసిందో
అర్థంకానీ ఆహాన్ని కట్టేసుకుని
పరమార్థాన్ని అన్వేషించాలనుకోవటం ఆరాటమేనా
జీవితపు దారిపొడుగునా రహస్యపు  పోరాటమేనా

మనసుల నగ్నత్వాన్ని
మనుషుల అస్థిత్వాన్ని
అన్వయించాలనుకోవటం
తనకు మాలిన తత్వం పాడుకోవటమేగా
పొందాల్సింది ఏమి లేదు
పోవాల్సిందే పేరుకుపోయిందంటూ

★★★



# నిశీధి

వారాల ఆనంద్



ఉతికి ఆరేసినట్టు
తడి పొడి కలగలిసి
ఆలోచనలు
వేలాడుతుంటాయి

చీకటీ వెలుతుర్లను
మిక్సీలో వేసి గిరా గిరా తిప్పినట్టు
కళ్ళేమో
స్పష్టా స్పష్ట మయిన ఆకారాల్ని చూస్తూ
తడుముకుంటాయి

పదాల్ని కుప్పబోసి
అర్థమేదో అనర్థమేదో తూర్పారబట్ట లేక
మాటలేమో
చతికల బడతాయి

దేహం మొత్తం
ఇస్సుర్రాయిలో పడి నలిగి పోయినట్టు
నిలబడ లేదు కూచోలేదు
బట్టల్ని మూట గట్టినట్టు ముడుచుకు పోతుంది
తెగదు తెమలదు

స్తబ్దత రక్తం నిండా పొర్లాడుతుంది
నిశ్శబ్దం నిలువెల్లా వ్యాపిస్తుంది

తడి సోకని ఎడారిలా
మనసు ఒక్కోసారి పొడి బారుతుంది

నిశ్శబ్దపు అడివిలో
నిశీధి చేరినట్టు

★★★



# సావుకు ఎన్కమర్ల

బండారి రాజకుమార్

పోతూ...పోతూ...
ఏం మూటగట్టుకుని పట్కబోతం ?
కొన్ని పావురాల్ని
కొన్ని కన్నీళ్లని
కొన్ని యాదుల్ని ఇడ్శిపెట్టి
ఫలానా పేర్ల మీద చెక్కబడిన
మంచి చెడులనే ముద్దెర్లు దప్ప !

సావుకు ఎన్కమర్ల...
ఏం దాక్కోని వుంటది ?
ఎట్ల బతికినవో సూపెట్టే
నీ అసలు రంగును పూతపూసిన
కట్టసుఖాలను ఏకరువు పెట్టే
జీవితపు నిలువుటద్దం దప్ప !!

పిడికిట్ల గాలిని ఒడిసిపట్టలేనని
నీకు నువ్వే పరాయివైతే
ఓటు పట్వల నీరు ఒలికిందని
నీటిమీది రాత బతుకులు
నీతులల్లి నిండుకుండను నిలదీయాలనుకుంటయి
నీ జాగల నువ్వు బతకటానికి సుత దేబిరించాల్సి వత్తది !
నీ సొత్తు నీకు ఇముడాలన్నా
నోసుకుని పుట్టాలనిపిత్తది !!

రేపటి కోసం నువ్వు దాపెట్టిన
గింజల మీద ఎవరి పేరు రాసినవో
నీకైనా...ఎరుకేనా ?
మాసిన బట్టల్ని ఉతికివేసుకునే
నీ బలగం
నువ్వొదిలెల్లిన ఇంటిగోడలపై
నీ పోటువొక్కటన్న యాలాడదీత్తరో..లేదో ..అనుమానమే !
ఆఖరి దినాలల్ల నువ్వున్న అర్రను
నీ యాదుల్తో నింపి మ్యూజియంలా
సూత్తానికి పెడ్తరనుకుంటే తప్పే!!

ఒక్క గుండెను తడిచెయ్యలేని
అదీ...ఒక సావేనా ?
నువ్వెలా బతికినవో...
నీ సావే గవాయి !
సచ్చినా...బతికినవో
నీ కదే నివాళి !!

★★★



# కాలం

డేగల అనితాసూరి

నేను పోగేసుకున్న కాలమంతా
గతం వ్రేళ్ళుపట్టుకుని వెళ్ళిపోయింది !
అనుభూతుల శిశిరం
రాల్చేసిన స్వప్నాలు
జాలిగా చూస్తూ జారిపోతున్నాయి..
ముక్కూముఖం జాడతెలియని భవిష్యత్
నలువైపులా ఆవరించి
ప్రమేయం లేని పెత్తందార్లై
దిశానిర్దేశం చేస్తున్నాయి!
అప్పుడప్పుడూ వర్తమానం వొళ్ళో
సేదదీరే మనసు ,
వుండుండీ ఉలికిపడ్తుంటే
ఊహల ఉక్కుపిడికిట్లో నలిగి
ఊపిరాడని కోరికల గాలానికి వ్రేళ్ళాడ్తూ
సమాధికట్టుకుంటున్న
సమయాభావపు చేతులు
నవ్వుతూ  తనలోకి
పొదువుకున్నాయి!!







# ఆమని తెలియని పాట

లిపి మల్లాది



స్వేచ్ఛగా ఎగిరే పక్షి
ఆకాశాన్ని జయిస్తుంది
వర్షాన్ని ఎదురిస్తుంది
గాలిని ఖండిస్తుంది

పంజరంలో చిక్కుకున్న పక్షి
ఆకాశాన్ని చూడలేక,
వానను తాకలేక,
కన్నీరు కారుస్తుంది.

స్వేచ్ఛగా ఎగిరే పక్షి
సూర్యుని చేరడానికి ప్రయత్నిస్తుంది
నింగిని తాకేందుకు తపిస్తుంది
నేలమీద జీవులను గమనిస్తుంది.

పంజరంలో చిక్కుకున్న పక్షి
రెక్కలు కట్టేసి
శోకంలో మునిగి
కీచు గొంతుతో ఆవేదన వ్యక్తం చేస్తుంది.

పంజరంలోని పక్షి
పర్వతాన్ని చేరదు,
జలపాతాన్ని చూడదు,
మంచుని తాకదు..
కానీ, కలల సమాధిపై నిలబడి
తన నీడే పీడకలగా మారి
భయమే జీవితమై
కాళ్ళు కదలక పాడే రాగం
ప్రపంచాన్నే మారుస్తుంది.!!

★★★



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

వత్సరములు గడచె భావశూన్యతలోన
రాగసుమములెటనొ రాలిపోయె
ఇన్ని నాళ్ళకిప్పుడెదనేల పులకించి
చెలిమి గూర్చి తలపు చిగురు తొడగె

కోయిలలు వచ్చి వసియించి గుండెలోన
కవితలను వెలయించె నా గళమునుండి
నిదురలో మున్గినట్టి నా హృదయమిపుడు
ప్రేమ తూర్పునను దయింప వెలుగు చూచె

వెలుగు రేఖలు పైడిదారులను కట్టి
ప్రేమకిరణముల్ ప్రసరించె విశ్వమెల్ల
నిదురనుండి లేచినదొక్క నేనె కాదు
ప్రకృతి యెల్లను ప్రేమతత్వమున మునిగె

నెచ్చెలిని గూర్చి తలచని నిదురయందు
మరణజీవితమ్ముల మధ్య మార్గమందు
తెలివిలేమియె తోచు సంతృప్తి వోలె
మేలుకొనిన నాడు గతము మృత్యుసమము

నిండునానందమెద ప్రేమ నిండినపుడు
మించు మోదము ప్రేమను పంచినపుడు
ఎరుగనేరక బ్రతికితినింతవరకు
చెలియ! మేల్కొంటి నేడు నీ చెలిమి వలన


చిత్రం:కె.రామ్మోహన్

COMMENTS